www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 22 డిసెంబర్ 2024

5



జాబ్ మేళాలో 106 మంది ఎంపిక



జాబ్ మేళా నిర్వహిస్తున్నకంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన మినీ జాబ్ మేళాలో కళాశాలకు చెందిన 106మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్ఎస్.నరసింహారావు శనివారం తెలిపారు. రెండు రోజులు పాటు జరిగిన ఈకార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ కె.మనోహర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టెక్ మహేంద్ర, హెచ్‌డిఎఫ్‌సి, అపోలో ఫార్మసీ, జెన్పో, టిసిఎస్ మొదలగు కంపెనీల ప్రతినిధులు, కళాశాల ఎ.ఒ కరాటం ప్రవీణ్, అధ్యాపకుల యూనియన్ వరప్రసాద్, వోడే జాన్ పాల్, బి.శ్రీనివాస్, కె.శ్రావణ్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం దొంగలను ఎందుకు పట్టుకోలేదు?

- సిపిఎం బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- పెద్దాపురంలో కాకినాడ జిల్లా మహాసభ ప్రారంభం
- భారీ ప్రదర్శనతో ఎరుపెక్కిన పట్టణం, ఆకట్టుకున్న కళారూపాలు



బహిరంగ సభకు హాజరైన ప్రజలు,ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం

సినిమా డైలాగు మాదిరిగా 'సీజ్ ద షిప్' అన్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రెండు నెలలుగా బియ్యం దొంగలను ఎందుకు పట్టుకోలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. కాకినాడ జిల్లా సిపిఎం 24వ మహాసభలో భాగంగా శనివారం పెద్దాపురంలో భారీ ప్రదర్శన, అనంతరం ఆంజనేయస్వామి గుడి సెంటర్లో బహిరంగ సభ జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని పాలిస్తున్న మోడీ అభివద్ధిని పక్కన పెట్టి అదానీ సేవలో మునిగిపోతున్నారన్నారు. చివరకు సూర్యరశ్మిని కూడా అదానీకి అమ్ముకున్నారన్నారు. విద్యుత్ బిల్లులు, పన్నుల భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను ప్రధాని స్థానంలో ఉన్న మోడీ వెనకేసుకుని రావడం శోచనీయమన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలను చేకూర్చేందుకు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. జమిలీ ఎన్నికల వల్ల రాష్ట్రాలు ఉనికిని కోల్పోతాయన్నారు.

పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌ను గెలిపించుకుంటే జిల్లా అంతా పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసించారన్నారు. అయితే ఆరు నెలలు దాటినా ఎక్కడా అభివృద్ధి జాడలేదన్నారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని విమర్శించారు. ఒక్కరి పైన కూడా కేసును ఎందుకు నమోదు చేయలేదన్నారు. యాంకరేజ్ పోర్టును మూసివేసి ప్రైవేటు వ్యక్తులకు లాభాలు చేకూర్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారన్నారు. కార్మికుల పొట్టను కొట్టి పోర్టుని మూసివేసే కుట్రలు మానుకోవాలన్నారు. అధికారంలోకొస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని, పరిశ్రమలను తీసుకొస్తామని ప్రజల ఆదాయాలను పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కాని ఇలాంటి చర్యలేవీ నేటికీ తీసుకోలేదన్నారు. .

సనాతన ధర్మం పేరుతో పవన్ కళ్యాణ్ కొత్త నాటకానికి తెరలైతారన్నారు. ప్రజలు బిజెపి మతోన్మాద



సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న దారపురెడ్డి సత్యనారాయణ



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నాయకులు, కార్యర్తలు

రాజకీయాలపై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. టిడిపి, వైసిపి, జనసేన వైఖరిలని గమనిస్తూ ఉండాలన్నారు. మోడీకి లొంగిపోయిన ప్రతి పార్టీ పక్కకు పోయాయని తెలిపారు. మోడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలే నిలబడ్డాయన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్దాపురం పెట్టింది పేరు

1950 నుంచి పెద్దాపురం ప్రాంతం కమ్యూనిస్టు ఉద్యమానికి పెట్టింది పేరన్నారు. యాసలపు సూర్యారావు వంటి కమ్యూనిస్టు నాయకులు ఇక్కడ పోరాడిన చరిత్ర ఉందన్నారు. పెద్దాపురంలో ప్రజలు అనేక సమస్యలపై పోరాడుతున్నారని గుర్తు చేశారు. పెద్దాపురంలో 30 పడకల ఆసుపత్రి 100 పడకల స్థాయికి తీసుకువెళతామని హామీ ఇచ్చిన పాలకులు నేడు పట్టించుకోవడం లేదన్నారు. ఏలేరు ఆధునికీకరణ మాట మరిచారన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు.

సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఏలేరు ఆధునికీకరణ లేక రైతులు నష్టాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల సాగో, చక్కెర ఫ్యాక్టరీలు మూతబడ్డాయన్నారు. సిపిఎం మహాసభల్లో ప్రత్యామ్నాయ విధానాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సిపిఎం జిల్లా నాయకులు జి.బేబిరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభజన హామీల మాట మరిచిందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రక్షణ, ఆరోగ్య సౌకర్యాలు కరువయ్యాయన్నారు. జీడీ పిక్కల పరిశ్రమల కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో జనాభా పెరుగుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూడం లేదన్నారు. సభకు సిపిఎం నాయకులు సూరిబాబు ఆహ్వానం పలకారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, నాయకులు దువ్వా శేషబాబ్జి, కెఎస్ శ్రీనివాస్, కరణం ప్రసాదరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

బలమైన వర్గపోరాటాలు నిర్మించాలి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

రానున్న రోజుల్లో బలమైన వర్గపోరాటాలను నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం కాకినాడ జిల్లా మహాసభలో భాగంగా శనివారం నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి నిధులను తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకోవాలన్నారు. విద్యుత్ సంస్కరణలు, విద్యుత్ భారాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్ల కలిగే అనర్థాలను, అదానీ కోసం పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విస్తతంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలన్నారు.



ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలో భాగంగా జమిలి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకొచ్చిందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు అంబేద్కర్ అంశం తీసుకొచ్చారన్నారు. పార్లమెంటులో జరుగుతున్న పరిణామాలను అందరూ గమనించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని తుందలో తొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఏదొక రూపంలో జమిలి బిల్లును నెగ్గించుకోవడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీలో మెజారిటీ సభ్యులు బిజెపికి అనుకూలంగా ఉన్నవారే ఉన్నారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బిజెపి ఏజెండాను రాష్ట్రంలో అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభకు కరణం ప్రసాదరావు, జి.బేబిరాణి, సిహెచ్.రమణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత సభా ప్రాంగణంలో సిపిఎం పతకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. అలాగే సంతాప తీర్మానాన్ని కెఎస్.శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. . ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ నాయకులు ఎవి నాగేశ్వరరావు, జిల్లా నేతలు ఎం.రాజశేఖర్, కె.శ్రీనివాస్, శేషబాబ్జి, బేబిరాణి, కె.ప్రసాద్, ఎన్.సూరిబాబు, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కళారూపాలు

మహాసభలో ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విప్లవగీతాలు ఉత్సాహాన్ని రేకెత్తించాయి. కళాకారులు రొంగల వీర్రాజు, డి.కృష్ణ, ఎం.రాంబాబు, డి.సత్యనారాయణ, జె.శ్రీను, కే.నాగు, మాగాపు నాగు, లోవరాజుల బృందం ఆలపించిన గీతాలు ఉత్తేజాన్ని నింపాయి. ఎస్‌కె.గౌస్ మొహిద్దిన్, నియాజుద్దీన్, సిహెచ్.వీరబాబు, ఎ.లేఖ్య, వై.లీలా కుమారి, సూర్య కళ, పూజిత, దుర్గాదీపిక, బంగారు రాజు, సూర్య అఖిల ల బృందం ప్రదర్శించిన కళారూపాలు కట్టిపడేశాయి. ప్రజల్లో ఆలోచనను రేకెత్తించాలి.



11 నుంచి లొల్ల లాకుల వద్ద సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం



సర్ఆర్థర్ కాటన్ ట్రోఫీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎంఎల్ఎ సత్యానందరావు

స్థానిక మండల పరిధిలోని లొల్ల లాకులు వద్ద కోనసీమ సంక్రాంతి సంబరాలు పేరిట జనవరి 11, 12, 13 తేదీలలో ఈతల పోటీలు, గాలిపటాల పోటీలు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ కరపత్రాన్ని ఆవిష్కరించి క్రీడా పోటీలను లాంఛనంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎంఎల్ఎ బండారు సత్యానందరావులు ప్రారంభించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అఖండ గోదావరి నది ప్రాంతం ప్రకృతి అందాలు, రమణీయత మధ్య ఎంతో ఆహ్లాదకరంగా పర్యాటకులను కను విందు చేస్తోందన్నారు. స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ప్రత్యేక చొరవతో ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయ న్నారు. ఆ దిశ గా ఈ ప్రాంతం పర్యాటకంగా విరాజిల్ల నున్నదని అభిలాషించారు. సంక్రాంతి పండుగలకు తెలంగాణ, ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకు లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంన్నారు. ఈ సందర్భంగా జనవరి 11, 12, 13 తేదీలలో ఈ ప్రాంత విశిష్టత, కీర్తిప్రతిష్టలను నలుమూలలా వ్యాపింపజేసే దిశగా ఈతల పోటీలు, గాలి పటాల, ముగ్గుల పోటీలతో కోనసీమ సంక్రాంతి సంబరాలు నిర్వహించడానికి సంకల్పించామ న్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణులకు బహుమతులుఅందించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఆయా రంగాలలో ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ సదవకా శాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ముందుగా తమ తమ పేర్లు నమోదు చేయించు కోవాలన్నారు. ప్రభుత్వం తరపున కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి వారి సిబ్బంది, పోలీసు ఇరిగేషన్, మత్స్య, శాఖలు సమన్వయంతో ఈ పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. అయితే లొల్ల లాకుల వద్ద పర్యా టకుల వసతి వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యా లను కల్పించాలని ఆదేశించారు. ఇదొక అద్భుతమైన చక్కటి సదవకాశమన్నారు. ఎంఎల్ఎ సత్యా నంద రావు మాట్లాడుతూ ఆర్థర్ కాటన్ మహాశయుడు గోదావరి ప్రాంతాన్ని సస్య శ్యామలంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ఈ ప్రాంత అభివృద్ధికి శ్రమించా రన్నారు. ఆయన నిర్మించిన డెల్టా ఆనకట్టకు అనుబంధంగా ఉన్న లొల్ల లాకులు వద్ద ఆహ్లాదకరంగా పర్యటన ఆకర్షించే విధంగా పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. లొల్ల లాకులు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అసెంబ్లీలో సిఎం, పర్యాటకశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఆ దిశగా ఏర్పాటుకు వారు సుముఖత వ్యక్తం చేశార న్నారు. ఈ ప్రాంతం ఒక పక్క పచ్చదనం, మరొ క పక్కా గోదావరి నీటితో ఆహ్లా దకరంగా ఉండడం వల్ల పర్యాటకులను ఆకట్టుకు నేందు కు అవకాశాలు ఉన్నా యన్నారు. ఈ కార్య క్రమంలో కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్, ఆత్రేయ పురం మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శనివారం దళితుల సంఘాలు, ఆటోయూనియన్ నాయకులు నిరసన తెలిపారు.


అమలాపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేసి డాక్టర్ అంబేద్కర్‌కి క్షమాపణలు చెప్పాలని దళిత ప్రజా సంఘాలు, ఆటో యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎర్రవంతెన వద్ద ది కోనసీమ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడారు. కార్యక్రమంలో గెద్దాడ బుద్ధరాజు, మెండి డేవిడ్ ఆటో యూనియన్ నాయకులు



అమలాపురంలో ఆటో యూనియన్ నాయకుల నిరసన

కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కె.గంగవరం మెయిన్ సెంటర్ లో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కె.గంగవరం మండలం మాలమహానాడు నాయకులు రవ్వ భూషణం, కోటి వెంకట్రావు, ఈరెళ్ళ రాజు అన్నవరం గిడ్ల వీరప్రసాద్, పాము భాస్కరరావు. మల్లెల వెంకట్రావు, ఎలమంచిలి సత్యనారాయణ, జంగం సత్తిబాబు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, భారత కార్మిక సంఘాల సమైక్య నాయకులు చింత రాజారెడ్డి, ద్రాక్షారామ జై భీమ్ సంక్షేమ సేవా సంఘం గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కె.గంగవరం లో దళితుల నిరసన ప్రదర్శన

డిఆర్‌పిలకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో డిఆర్‌పిల ముడు రోజుల శిక్షణ చివరి రోజైన శనివారం ముగిసింది. జ్ఞానజ్యోతి ట్రైనింగ్ సెంటర్ కోర్సు కో-ఆర్డినేటర్ బి.రమణశ్రీ ప్రసంగించారు. ఈ శిక్షణలో భాగంగా జిల్లాలోని 124 మంది డీఆర్పీలు చేసిన టీఎల్‌ఎం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని కొనియాడారు.ఈ సమావేశంలో ఎంఇఒ-2 ఆర్.ఉదయ భాస్కర్, కెఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక

ఛైర్మన్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ నరసింహారావులకు పలువురి అభినందన



ఛైర్మన్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ నరసింహారావులను సన్మానిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు, తదితరులు

ప్రజాశక్తి - అమలాపురం

గోదావరి మధ్య డెల్టా నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గా గుబ్బల శ్రీనివాస్, వైస్ ఛైర్మన్‌గా కరుటూరి నరసింహారావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన పది డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షు లను ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగానే ఎన్నుకు న్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్ నందు ఏకగ్రీవంగా ఎంపిక కాబడిన ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కరుటూరు నరసింహారావులకు పలువురు ప్రజాప్రతి నిధులు శుభాకాంక్షలు తెలిపారు.

సాగునీటి సంఘాలకు జవసత్వాలు

ఈ సందర్భం గా ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు మాట్లా డుతూ సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు పూర్తి కావడంతో జవసత్వాలు వచ్చాయని తెలిపారు. సాగునీటి వనరులు నిర్వహణ స్థానిక సంఘాలే చేపట్టాలని ప్రభుత్వం భావించి ఈ మేరకు ఎన్నికలు కూడా పూర్తి చేసిందన్నారు సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టి సంఘాల భాగస్వామ్యంతో కాలువ చిట్ట చివరి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా నిర్వహణ ఉండాలని ప్రభుత్వం భావించిందన్నారు నదులు, జలాశయాలు, నీటి వనరుల నిర్వహణ సంరక్షణ ప్రక్రియలను సంఘాలు చేపట్టాలన్నారు. కొంతకాలంగా పూడికతీత పనులు, మరమ్మతు, కాలువ గట్ల బలోపేతం వంటి వాటిపై క్షేత్రస్థాయిలో ముఖ్యమైన పనులు నిలిచిపోయాయని ఇప్పుడు సాగునీటి సంఘాలకు తిరిగి ఊపిరిలూదడం ద్వారా నీటి వనరుల సంరక్షణ నిర్వహణ కు ఇబ్బం దులు లేకుండా చూడాలని ఎన్నిక కాబడిన వారిని కోరారు.

శ్రీనివాస్ ఎంపికపై హర్షం

రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో రాజోలు చిట్టచివరి డెల్టా ప్రాంతమన్నారు. ఖరీఫ్ సీజన్లో చిట్టచివరి వరకు సాగునీరు సకాలంలో అందక సాగు ఆలస్యం అవ్వడంతో పాటుగా పంట కోత సమయంలో తుపాను, ముంపు వంటి విపత్తుల బెడద వల్ల రైతులు న్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా రన్నాయరు. ఆ సమస్యల పరిష్కారానికి ఈ ప్రాంతానికి చెందిన అభ్యర్థిని ప్రాజెక్ట్ కమిటీ కి ఎంపిక చేయాలని కోరిన మీదట ఏకగ్రీవంగా ఈ ప్రాంత అభ్యర్థి గుబ్బల శ్రీనివాస్ ను అధ్యక్షునిగా ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి ఉపాధ్య క్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధ్యక్షులు అల్లాడ స్వామి నాయుడు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొ న్నారు.

ఘనంగా మాజీ సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎపి మాజీ సిఎం, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం జిల్లాలో పార్టీ శ్రేణుల ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.


అమలాపురం: వైఎస్.జగన్ పుట్టినరోజు సందర్భంగా శనివారం పట్టణంలోని హై స్కూల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. వైసిపి విద్యార్థి విభాగం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెళ్ళ రమేష్, జిల్లా అధ్యక్షులు మిండగుదుటి శిరీష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బుద్దాల నాగరత్నం మెమోరియల్ వాలంటరీ బ్లడ్ సెంటర్ నందు విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని బ్లడ్ క్యాంపును ప్రారంభించారు. **రామచంద్రపురం:** పట్టణంలోనూ, ద్రాక్షారామంలోనూ వైఎస్. జగన్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైసిపి శ్రేణులు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు **అల్లవరం:** స్థానిక హైస్కూల్ సెంటర్లో వైసిసి మండల అధ్యక్షుడు కొనుకు బాబూజీ ఆధ్వర్యంలో వైఎస్.జగన్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండల పరిధి అంగరలోని వైసిపి కార్యాలయంలో జగన్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.



అమలాపురంలో రక్తదానశిబిరాన్ని ప్రారంభిస్తున్న విశ్వరూప్

ఆలమూరు: స్థానిక బస్టాండ్ సెంటర్ వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షత వహించగా ఎంపిపి తోరాటి లక్ష్మణరావు పాల్గొన్నారు. వైసిపి నేతలు నెక్కంటి వెంకట్రాయుడు, నామాల శ్రీనివాస్, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, గుణ్ణం రాంబాబు, రావాడ సత్తిబాబు తదితరులు పాల్గొని మాజీ సిఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. **ఉప్పలగుప్తం:** గొల్లవిల్లి లో వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన జరిగిన వైఎస్. జగన్ పుట్టినరోజు వేడుకల్లో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు, వైసిపి మండల కార్యదర్శి పినిపే జయరాజు తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. **ముమ్మిడివరం**: నగర పంచాయతీ పరిధిలో బుద్ధ పార్కు అవరణలో జగన్ పుట్టినరోజు పురస్కరించుకుని కేక్ ను మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ కట్ చేశారు.

కార్టూ'నిజం'



లక్ష సాధనకు కృషి చేయాలి

- జాగ్వర్ ల్యాండ్ రోవర్ సిఇఒ ఇంద్రకంటి లలిత
- మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులతో ముఖాముఖి


ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, దాన్ని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలని జాగ్వర్ ల్యాండ్ రోవర్ కంపెనీ సిఇఒ లలిత ఇంద్రకంటి సూచించారు.. లక్ష్య సాధనలో భాగంగా చదువు విజ్ఞానంతో పాటు అవకాశాలు అందుపుచ్చుకున్నందుకు కొంతమేర రిస్కు తీసుకుని ఛాలెంజ్‌గా దూసుకుపోవాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో విద్యార్థినిలతో ముఖాముఖి, ఇష్టాగోష్టిలో ఆమె మాట్లాడారు . అమలాపురంలో ఒక పెళ్లికి హాజరైన లలిత ఇంద్రకంటి ఆమె తన పూర్వపు స్నేహితురాలైన బండి రాధమ్మ స్వగృహానికి వచ్చారు. సంఘ సేవకురాలు రాధమ్మ విజ్ఞప్తి మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిలతో కొంతసేపు సమావేశమై విద్యార్థినిలకు ఉన్నత లక్ష్యాలను అందుకునేందుకు ఎలా ప్రిపేర్ అవ్వాలో ఉదాహరణలతో సహా వారికి అవగాహన కల్పించారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఇంద్రకంటి లలిత

నేను ఓ పేద కుటుంబం నుంచే ఈ స్థాయికి వచ్చానని చెబుతూ... తన చదువు ఉద్యోగం అనంతరం విదేశాలకు వెళ్లడం పలు కంపెనీలకు సిఇఒగా వ్యవహరించడం, ప్రస్తుతం తను నిర్వహిస్తున్న బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పలువురు విద్యార్థినిలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రస్తుతం మహిళలు చాలా ఉన్నతమైన స్థానంలో ఉన్నారని అన్నారు. నిజాయితీగా ఉంటూ విజ్ఞానాన్ని సంపాదించి విద్యార్థినిలు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకురాలు బండి రాధమ్మ ప్రోత్సాహంతో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలో అధిక మార్కులు వచ్చిన విద్యార్థినిలకు బహుమతులు అందించారు. అనంతరం శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ గుర్రం శ్రీనివాసరావు, అడబాల శ్రీనివాస్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ తనిఖీ నిర్వహిస్తున్న డిఐజి

శాంత్రి భద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - పి.గన్నవరం

ప్రజలకు, సమాజానికి, ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని డిఐజి జివిజి.అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం పి.గన్నవరం ఆయన పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా డిఐజి అశోక్ కుమార్‌కు పోలీస్ కవాతుతో గౌరవ వందనం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డిఎస్‌పి వై.గోవిందరావు, పి.గన్నవరం సిఐ ఆర్.భీమరాజు, ఎస్ఐ శివకృష్ణ పాల్గొన్నారు.

మాటలు... మంటలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు జిల్లాలో మంటలు రేగాయి. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి వైఖరి మరోసారి దర్శనం పట్టాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు భగ్గుమన్నాయి. ఈ కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా ప్రజలు హాజరై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన గత పదేళ్లలో ఆర్థిక విధ్వంసంతో పాటు సామాజిక సమతుల్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా చేసిన వ్యాఖ్యలు మరింత ప్రకంపనలు సృష్టించాయి. అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్ వ్యక్తమైంది. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు మిన్నంటుతున్నప్పటికీ కూటమి నాయకుల నుంచి స్పందన కరువైంది. దీంతో ఆయా పార్టీలోనూ చర్చ మొదలైంది. ప్రజా ఆందోళనల నేపథ్యంలో కనీసం స్పందించకపోవటం రాబోయే రోజులలో ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రాకతో జోష్

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రాకతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు పదవీ కాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో తాజా పర్యటన మరింత ఆసక్తి రేపింది. రాబోయే ఏడాది జులైలో ఎన్నికలు అంటూ తీపికబురు చెప్పడంతో టిడిపి శ్రేణుల్లో అప్పుడే హడావిడి మొదలైంది. ఇప్పటికే కార్పొరేటర్లుగా అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన వారు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. తమ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మరోవైపు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో విలీన ప్రాంతాల సమస్యలను చక్కదిద్దినట్లయితే కార్పొరేషన్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లే. జిల్లాల విభజన అనంతరం జిల్లా కేంద్రాలలో పట్టణ జనాభా సంఖ్య క్రమంగా పెరుగుతున్న విషయం విదితమే. గ్రామాల నుంచి ఉపాధి కోసం వలసలు రావటమే దీనికి కారణం. నూతన పాలక వర్గాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల అవసరాలకు తగ్గట్లుగా ఏ మేరకు అభివృద్ధి చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ

భూ సమస్యలను పరిష్కరస్తామంటూ జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువలా వస్తున్నాయి. స్థానిక సమస్యలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన పొరపాట్లు సైతం ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 33 రోజులలో సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఏ మేరకు చొరవ చూపిస్తారో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికే పిజిఆర్ఎస్ పేరుతో ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న విషయం విదితమే. ప్రజల విన్నపాలను పూర్తి స్థాయిలో పరిష్కరించకమునుపే అంకెల గారడీ చేస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర కేంద్రమైన అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో తేటతెల్లమైంది. ఈ పనితీస్థితిని ప్రభుత్వం ఎలా చక్కదిద్దుతుందో వేచి చూడాలి.

ఉత్సాహంగా సిపిఎం మహాసభలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సిపిఎం శ్రేణులలో ఉత్సాహం నెలకొంది. ఇటీవల డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభలు పూర్తియిన విషయం విదితమే. తాజాగా కాకినాడ జిల్లా మహాసభలకు రంగం సిద్ధమైంది. రెండ్రోజులపాటు జరిగే ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా ప్రణాళికలను రూపొందించారు. తూర్పుగోదావరి జిల్లా మహాసభలకు ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. ఇటీవల లోగోను ఆవిష్కరించిన విషయం విదితమే.

నేరాలు ఘోరాలు

బీరువా పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామంలో చెక్క బీరువా పడి చిన్నారి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పాడ గ్రామంలో ఉన్న చర్చ్ ఫాదర్ జేసుదాస్ కూతురు, మనవరాలు కొంతకాలంగా ఉప్పాడ చర్చి ఆవరణలో ఉన్న ఇంటిలో ఉంటున్నారు. శనివారం ఉదయం జె.జయకీర్తన(3)పై బీరువా పడడంతో తీవ్రంగా గాయపడింది. కొత్తపల్లి పిహెచ్‌సికి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించాలని వైద్యులు తెలిపారు. దీంతో 108కు సమాచారం ఇచ్చారు. గంట ఆలస్యంగా వచ్చిన 108లో కాకినాడకు తరలించే క్రమంలో ఆ చిన్నారి మార్గమధ్యంలో మృతి చెందింది. 108 వాహనం సమయానికి వచ్చి ఉంటే చిన్నారి ప్రాణాలు పోకుండా ఉండేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

1,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధి సూరంపాలెం రహదారిలో తవుడు ఫ్యాక్టరీ వెనుక పరిసరాలలో శనివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్‌ఐ చిట్టిబాబు పాల్గొన్నారు.

మోటార్ వైర్ల అపహరణ

ప్రజాశక్తి-కడియం

కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేట, బుర్రిలంకలో రెండు రోజులుగా రాత్రి సమయంలో మోటార్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడంతో నర్సరీ రైతులు గగ్గోలు పెడుతున్నారు. వెంకాయమ్మ పేట నుండి కడియం వెళ్లే రోడ్డులోని పలువురు రైతుల నర్సరీల్లో ఇప్పటికే వైర్ల దొంగతనాలు జరగడంతో రైతులు నర్సరీ అసోసియేషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో దొంగతనాలు జరిగిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గాద నాగేశ్వరావు, డైరెక్టర్లు రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, పిల్లా శ్రీనివాస్, తాడాల నాగేశ్వరావు, పిఆర్ఓ గరగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

90 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు సారా బట్టీలపై దాడి చేసి 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ జ్యోతీశ్వరీ బాలాజీ తెలిపారు. గాదరాడ, కణుపూరు గ్రామాల్లో సుమారు 2400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో నాటు సారా స్థావరాలను ధ్వంసం చేసి 7 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 90 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు జి.నూకరాజు, ఎ.సతీష్, పి.అనుశ్రీ పాల్గొన్నట్టు తెలిపారు.

బైకుల దొంగ అరెస్ట్
10 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

బైకులను అపహరిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 10 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ తెలిపారు. సీతానగరం మండలం చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో బైకుల చోరీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌పి ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారని తెలిపారు. ఎస్ఐ సత్య కిశోర్, ఎస్ఐ డి.రామ్ కుమార్, సిబ్బంది కలిసి నిడదవోలుకు చెందిన బండారి రామును అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడు సీతానగరం మండలం ఉండేశ్వరపురంలో నివాసం ఉంటున్నాడని, గతంలో రాజా పై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 కేసులు ఉన్నట్లు తెలిపారు.

వంగలపూడిలో
గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడిలోని సాయిబాబా గుడి వీధి వద్ద పిడబ్ల్యుడి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసుగల వ్యక్తి మృత దేహాన్ని కుళ్లిపోయి గుర్తించని స్థితిలో ఉన్నట్టు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9154875175, 9440904832 నెబర్లకు తెలియజేయాలన్నారు.

ఎస్.యానాం బీచ్ అభివృద్ధికి కృషి: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


పనులను పరిశీలిస్తున్న ఎం ఎల్ ఎ ఆనందరావు

గోవా బీచ్‌ను తలపించేలా ఆంధ్రాలో ఎస్.యానాం బీచ్ అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తున్నట్టు ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు తెలిపారు ఎస్. యానాం బీచ్ లో ఈనెల 27,28,29 తేదీలలో జాతీయ స్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బీచ్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బీచ్‌లో జరుగుతున్న పనులను శనివారం ఎంఎల్ఎ ఆనందరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఎనిమిది రాష్ట్రాలకు చెందిన మహిళా క్రీడాకారులు ఇక్కడికి వస్తున్నారన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాభిమానులకు వీక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామం నుంచి బీచ్ వరకు శాశ్వత ప్రాతిపదికన విద్యుత్ సదుపాయం ఏర్పాటు విద్యుత్ శాఖ ఎఇ శ్రీహరిని ఆయన ఆదేశించారు. అలాగే పూర్తిస్థాయిలో బీచ్ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు ఆయన సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వాలీబాల్ క్రీడలను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట అముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు, తహాశీల్దార్ విఎస్. దివాకర్, ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్‌కుమార్, మాజీ జడ్‌పిటిసి సభ్యుడు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం విభాగం ఉపాధ్యక్షులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, డి సి చైర్మన్ దంగేటి వెంకటరెడ్డి నాయుడు (చిట్టిబాబు), టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు పలచోళ్ళ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్థానిక ఇసుక రీచ్‌లో కాంట్రాక్టర్ పనులు కల్పించడం లేదంటూ గ్రామానికి చెందిన కూలీలు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు విన్నవించుకున్నారు. శనివారం కాటన్ ఆర్థర్ గోదావరి ట్రోఫీ, బహుమతులను ఆవిష్కరించడానికి ఆత్రేయపురం విచ్చేసిన ఆయనను కూలీలు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఇసుక ర్యాంపులో ప్రతిరోజు తమకు పనులు కల్పించడం లేదంటూ ఆయన ముందు మొరపెట్టుకున్నారు. ప్రతీ రోజు తమకు పనులు కల్పించాలని కూలీలు పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రావులపాలెం - బొబ్బర్లంక రహదారిలో మెర్లపాలెం వద్ద శనివారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తిని అటుగా వెళుతున్న కారు ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన ఎంఎల్ఎ తన వాహనాన్ని ఆపి గాయపడిన వ్యక్తిని పరామర్శించారు. అనంతరం బాధితుడిని తన వాహన శ్రేణిలోని కారులో ఎక్కించి ఊబలంక ఆసుపత్రికి తరలించారు. వైద్యులతో ఫోన్ లో మాట్లాడి గాయపడిన వ్యక్తికి తక్షణ వైద్యం అందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అండగా నిలబడి వైద్య చికిత్సకు దగ్గరుండి ఏర్పాట్లు చేయడంపై సత్యానందరావును పలువురు ప్రశంసించారు.

రెండు చోట్ల 'ఉపాధి'పై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - యంత్రాంగం

రెండు మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి సంబంధించి సోషల్ ఆడిట్ సామాజిక తనిఖీపై ప్రజా వేదిక సభలు నిర్వహించారు.

ఆలమూరు: 2023 - 24 ఏడాదికి గాను గత ఏడాది గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్ సామాజిక తనిఖీపై ప్రజా వేదిక సభను మండల స్త్రీ శక్తి భవనం ఆవరణలో ఎంపిడిఒ ఏ.రాజు అధ్యక్షతన డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.మధుసూదన్ శనివారం నిర్వహించారు. మండల పరిధి 18 గ్రామ పంచాయితీలలో 671 పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నివేదికలు డిఆర్పీలు చదివి వినిపించగా పీడీ మధుసూదన్ వివరాలు నమోదు చేసుకున్నారు. జరిగిన పనులలో గుర్తించిన వాటిపై చర్యలు తీసుకుంటామని మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడి కె.సత్యనారాయణ, ఎస్ఆర్‌పి వి.కనకరావు, డిఆర్‌పిలు డి.బాబూరావు, పి.కోటయ్య, ఎం.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం**: ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా ప్రజ ఆమోదయోగ్యమైన పనులు మాత్రమే నిర్వహించాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదన రావు అన్నారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శని వారం నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం16వ విడత సామజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రత్నకుమారి, ఎపిడి కె.సత్య నారా యణ, హౌసింగ్, పంచాయతీరాజ్, శాఖల అధికారులతో పాటు ఆయా గ్రామాల ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు ,ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వినియోగదారుల దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం


పోటీలు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అధికారులు

విద్యార్థి దశ నుండే వినియోగదారుల హకులు విధులు పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ వినియోగ దారుల దినోత్సవం పురస్కరించుకుని శనివారం వినియోగదారు న్యాయ పాలనకు వర్చువల్ విచారణలు మరియు డిజిటల్ సౌలభ్యం(థీమ్) అనే అంశం పై వ్యాస రచన మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలకు రాష్ట్ర స్థాయిలో విజయవాడలో డిసెంబర్ 23న జరిగే పోటీలకు ఎంపికయ్యారని వీరిని జిల్లా విద్యాశాఖాధికారి అభినందించారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి పోటీలకు గైడ్ టీచర్ పేరు, ఫోన్ నెం.సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబైలిజషన్ సెల్ నెం.63013 65479 కు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రెటరీ బి.హనుమంతరావు, ఎంఇఒ రమణ శ్రీ, ఉదయ భాస్కరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడ, పినపళ్ల ఆలమూరు గ్రామాలలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్మెంట్ ఐటిసి ఆధ్వర్యంలో శనివారం అయోడిన్ లోపంపై బుర్రకథతో అవగాహన కల్పించారు. అలాగే అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతలను వివరించారు. ఆహారంలో అయోడిన్ సరియైన మోతాదులో లేకపోవడం వలన అయోడిన్ లోపం ఏర్పడుతుందన్నారు. అయోడిన్, ఇనుము అధికంగా ఉండే సముద్రపు ఆహారాలతో మాంసకతులు ఉన్న ఆహారాన్ని సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఒఆర్‌డబ్ల్యూ ఎస్.సునీత, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

పాఠశాలలు,కళాశాలల్లో గణిత దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత మేధావి రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాజోలు: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మలికిపురం మండలం విశ్వేశ్వరాయ పురంలోని వివేకనంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ లో గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పివివి.వరప్రసాద్ తొలుత రామానుజన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **మండపేట:** రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణమని మండపేట ఎంఇఒ నాయుడు రామ చంద్రరావు అన్నారు. రామానుజన్ జయంతి నీ పురస్కరించుకుని మండపేట ఎంపిఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు ఆధ్వర్యంలో స్కూల్లో నిర్వహించిన గణిత విజ్ఞాన ప్రదర్శనను ఆయన శనివారం తిలకించి మాట్లాడారు. **కపిలేశ్వరపురం:** మాచర జడ్‌పి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు రామానుజన్ సంఖ్యను వినూత్నంగా ప్రదర్శించారు. రామానుజన్ సంఖ్య 1729 సంఖ్య ఆకారంలో విద్యార్థులు కూర్చొన్నారు. **కాట్రేనికోన:** చెయ్యేరు శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎమ్ శ్రీనివాస కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎన్ఎస్ వర్మ, పాలక వర్గ సభ్యులు సందీప్, కళాశాల విద్యాశాఖాధికారిణి డా.జయలక్ష్మి, కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్**: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కోనసీమ సైన్స్ పరిషత్ 2890వ మహాసభ నిర్వహించారు. కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సి.వి సర్వేశ్వర శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం కళాశాల యాజమాన్యం డా. సి.వి సర్వేశ్వర శర్మ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎఒ సేవారత్న కరాటం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం



ఈదరాడ సదస్సులో పాల్గొన్న తహాశీల్దార్

జిల్లాలో పలుచోట్ల రెవెన్యూ సదస్సులు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి అర్జీలను అధికారులు స్వీకరించారు.

మామిడికుదురు: భూ సంబంధిత రికార్డుల ప్రక్షాళనకే ప్రభుత్వము రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మండల ప్రత్యేక అధికారి ఎస్‌జెవి. రామ్మోహనరావు అన్నారు ఈదరాడలో సర్పంచ్ చట్టగుల్ల లక్ష్మి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సు లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దార్ వైవి.సుబ్రహ్మణ్యాచార్యులు కోరారు. రైతుల నుంచి ఆర్జీల స్వీకరించారు వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఎఒ మహేంద్ర, పంచాయతీ కార్యదర్శ పి ఎస్ ఎన్ రాజు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. **ఆలమూరు:** రెవెన్యూ సంబధిత దీర్ఘకాలిక సమస్యలతో పాటు అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలను అందజేసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహాశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు అన్నారు. మోదుకూరులో శనివారం రెవెన్యూ సదస్సు ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నేత చంద్రు శ్రీనివాస్, టిడిపి గ్రామ అధ్యక్షుడు దాయిని నాగేశ్వరరావు, ఆర్ఐ టి.రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** కోరుమిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన రెవిన్యూ గ్రామ సభ నిర్వహించారు. తహాశీల్దార్ పి.చిన్నారావు మండల ప్రత్యేకాధికారి, డిఎల్‌డిఒ కామేశ్వరరావు తదితరులు, పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** .గోపవరం పంచాయతీ కార్యాలయం వద్ద గోపవరం, సరిపల్లి గ్రామాలకు తహాశీల్దార్ విఎస్.దివాకర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఎంఎ షంషీ తదితరులు పాల్గొన్నారు.




మోదుకూరులో మాట్లాడుతున్న తహాశీల్దార్

సాన్నఘట్టం వద్ద పారిశుధ్య లోపం

ఇబ్బందులు పడుతున్న బాలబాలాజీ స్వామి యాత్రికులు

ప్రజాశక్తి -మామిడికుదురు


సానఘట్టం వద్ద పేరుకుపోయిన చెత్త

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి స్నాన ఘట్టం వద్ద పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శని, ఆదివారాలలో వేల సంఖ్య లో యాత్రికులు వస్తుంటారు దీనికి తోడు వైనతేయగోదావరి తీరంలో బాల బాలాజీ సానఘట్టం పరిసరాలలో చెత్త తో అధ్వానంగా ఉంది. ఈకారణంగా దుర్వాసనలు వ్యాపిస్తుండటమే కాకుండా సానఘట్టం సమీపంలో యాత్రికులు సానమాచరించే నీరు కలుషితం కావడంతో అసౌకర్యమునకు గురవుతున్నారు. మురుగు నీటిలో స్నానమాచరిస్తే వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉందనిఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జల్లు స్నానంతో, పరిశుద్ధ జలాలతో స్నానమాచరించేవారు. ప్రస్తతం జల్లుస్నానం పనిచేయక పోవడంతో మురికి నీటిలో స్నానమాచరిస్తూ యాత్రికులు అవస్థలు పడుతున్నారు. శ్రీ బాల బాలాజీ ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పర్యవేక్షణ తమది కాదంటే తమది కాదంటూ పంచాయతీ, దేవదాయశాఖల అధికారులు అంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించి యాత్రికులకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా తో మొల్లేటి వారి మెరక రోడ్డు బురద మయంగా మారింది బాల బాలాజీ స్వామి దర్శనానికి ద్విచక్ర వాహనాలపై వచ్చే యాత్రికులు అసౌకర్యానికి గురౌతున్నారు.

చెత్త నిర్వహణ బాధ్యత పంచాయతీ అధికారులదే..

శ్రీ బాల బాలాజీ సానఘట్టం సమీపంలో స్థానికులు వేస్తున్న చెత్తను పరిశీలించాం. స్థానికులు వేస్తున్న చెత్త కారణంగా వీటి నిర్వహణ బాధ్యత పంచాయతీ అధికారులదే. సంబంధిత అధికారులు చెత్త తొలగించే చర్యలు చేపట్టి సానికులు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

-ఎం.సత్యనారాయణ రాజు, బాలబాలాజీ దేవస్థానం సహాయకమిషనర్